క్లుప్తంగా

రైల్వే గేటును పరిశీలించిన ఎంపీ



గేటును పరిశీలిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

కారేపల్లి: డోర్నకల్–భద్రాచలం రోడ్ రైల్వే లైన్లో ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి గాంధీపురం వద్ద రైల్వే గేటును ఆదివారం ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి పరిశీలించి రైల్వే సిబ్బందితో మాట్లాడారు. ఖమ్మం – ఇల్లెందు మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని తరుచుగా గేటు పడడం వల్ల వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు.. రోగులను తీసుకెళ్లే అంబులెన్స్ కూడా ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తుందని స్థానికులు ఎంపీకి తెలిపారు. దీంతో ఆయన దక్షిణ మధ్య కేంద్ర రైల్వే శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన అలవాల నరేష్‌పై కుటుంబ కలహాల కారణంగా ఏపీలోని గంపలగూడెం మండలం నెమలి గ్రామానికి చెందిన అతని బావమరిది చీపు సురేష్, అతని బంధువు అలవాల నర్సింహారావు ఇరువురు ఆదివారం దాడి చేసి గాయపరిచారు. దీనితో నరేష్‌కు తీవ్ర గాయాలైనాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వైరా: స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి సమీపంలో ద్విచక్రవాహనంపై ప్రసాద్ రోడ్డు మరోవైపుకు తిప్పుతున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ప్రసాద్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం అందించగా.. వాహనంలో ఖమ్మం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు గండి పూడ్చివేత

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలోని రామసముద్రం చెరువు గండిని నీటిపారుదల శాఖ అధికారులు ఆదివారం పూడ్చి వేశారు. రామసముద్రం చెరువుకు గుర్తుతెలియని వ్యక్తులు గండి పెట్టడంతో నీరంతా వృథాగా పోతుంది. ఈ విషయాన్ని గ్రామస్తులు తహసీల్దార్, నీటిపారుదల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల శాఖ ఈఈ రామకృష్ణ, డీఈ రాంప్రసాద్‌లు అక్కడికి చేరుకుని గండిని పూడ్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులకు గండి పెట్టి నీటిని విడుదల చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈఈ హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని టౌన్–1 ఫీడర్‌లో సోమవారం ట్రీ కటింగ్ చేపడుతున్నందున ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్ బాబు తెలిపారు. పట్టణంలోని విద్యా నగర్ రోడ్, వాణి విద్యాలయం రోడ్, ఎస్‌వీఆర్ కాంప్లెక్స్ రోడ్, ఎండీ ఆస్పత్రి రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశ్నించడం ప్రజల హక్కు

బోనకల్: ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రజల హక్కు అని ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సల్స్‌గా చిత్రీకరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని మోటమర్రి గ్రామంలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ కార్యదర్శిగా వంగల కృష్ణ, సహాయ కార్యదర్శిగా మరీదు నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యంగల ఆనందరావు, ఏపూరి లతాదేవి, తాటి వెంకటేశ్వరరావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, తూము రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నిరసన

సత్తుపల్లిటౌన్: నిబంధనలకు విరుధంగా టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నారంటూ స్థానిక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నారు. ఆదివారం సత్తుపల్లిలో నారాయణ పాఠశాలలో టాలెంట్ టెస్టులు నిర్వహించడంపై నిరసన వ్యక్తం చేస్తూ.. నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ రూమ్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు అక్కడికి చేరుకుని ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయుడు వెంకటేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, వంశీ, కిరణ్, మురళీకృష్ణ, శంకర్, పీ.నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

‘రాజీవ్ యువ వికాసం’

దక్కేనా?

- దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు
- లబ్ధిదారుల గుర్తింపునకు.. డ్రా తీస్తారా? ఎంపిక చేస్తారా?
- నేటితో ముగియనున్న గడువు




ఎర్రుపాలెంలో ఆన్‌లైన్ సెంటర్‌కు వచ్చిన దరఖాస్తుదారులు

ఎర్రుపాలెం: యువతకు ఉపాధి కల్పించే దిశగా తెలంగాణా ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నిరుద్యోగ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తుంది. వ్యవసాయేతర పథకాలకు 21–55 సంవత్సరాల వయస్సు, వ్యవసాయ, వ్యవసాయాధారితక పథకాలకు 21–60 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసేందుకు అర్హులుగా ప్రభుత్వం ఖరారు చేసింది.

మండల వ్యాప్తంగా 2,500మందికి పైగా దరఖాస్తులు..

ఎర్రుపాలెం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల స్వీకరణకు గానూ పంచాయతీ కార్యదర్శులు ప్రచారం చేశారు. దీనికి తోడుగా అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 2,500 మందికి పైగా నిరుద్యోగ యువత ఆన్‌లైన్ దరఖాస్తులు చేశారు. కులం, ఆదాయం ధృవీకరణ పత్రాల కోసం యువత ఆఫీసులకు ఇంకా క్యూ కడుతున్నారు. దరఖాస్తులు వేలల్లో.. లబ్ధిదారుల ఎంపిక పదుల్లో ఎంపిక చేయడంతో తమకు నష్టం జరుగుతుందని యువత ఆందోళన చెందుతున్నారు. ముందే యూనిట్లను ప్రకటించి ఉంటే బాగుండేదని పలువురు వాపోతున్నారు.

సర్వర్ సతాయిస్తోంది..



మొరాయిస్తున్న సర్వర్

సత్తుపల్లిటౌన్: రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు సర్వర్ మొరాయిస్తుండటంతో దరఖాస్తుదారుల్లో టెన్షన్ నెలకొంటోంది. ఆన్‌లైన్ కేంద్రాల వద్ద గత నాలుగురోజులుగా దరఖాస్తు దారులు పడిగాపులు పడాల్సి వస్తోంది. ఆన్‌లైన్ కావటంలేదని.. సర్వర్ మోరాయిస్తుందని ఆందోళన చెందుతున్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా రూ.1 లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తుంది. రూ.50వేల వరకు నూరుశాతం రాయితీ ఉండగా.. రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90శాతం రాయితీ, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80శాతం రాయితీ, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ కల్పిస్తూ దరఖాస్తులను ఆహ్వానించింది. సర్వర్ సతాయిస్తున్నందున గడువును పొడిగించాలని దరఖాస్తు దారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎంపిక కోసం రాని గైడ్‌లైన్స్..

ప్రభుత్వం నుంచి లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎటువంటి గైడ్‌లైన్స్ రాకపోవడంతో అభ్యర్థుల అర్హతలను ఏలా గుర్తిస్తారోనని యువత ఆందోళనలో ఉన్నారు. గత ప్రభుత్వం డ్రా విధానం ద్వారా అర్హులను ఎంపిక చేయగా.. మరీ ఈ ప్రభుత్వం ఎలా ఎంపిక చేస్తుందోనని సందిగ్ధంలో ఉన్నారు. మండలానికి ఎన్ని యూనిట్లు మంజూరు చేస్తారోననే విషయం కూడా తెలియకుండా ఉంది.

అధికార పార్టీ అండతోనే అంటూ..

ఇప్పటికే ప్రభుత్వ పథకాల అర్హుల ఎంపిక కోసం గుర్తించిన ఇందిరమ్మ కమిటీ సభ్యుల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందనే ప్రచారం గ్రామాల్లో వినిపిస్తుంది. దీంతో ఇప్పటి నుంచే అధికార పార్టీ నాయకుల చల్లని చూపుల కోసం యువత నిరీక్షిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణతో పాటే లబ్ధిదారుల ఎంపిక విధి విధానాలు కూడా ప్రభుత్వం ప్రకటిస్తే బాగుండేదని నిరుద్యోగులు చెబుతున్నారు.

‘పౌల్ట్రీ పరిశ్రమ’కు దరఖాస్తు చేశా..



నేను ఇంటర్ చదువుకున్న. రాజీవ్ యువ వికాస్ పథకంలో పౌల్ట్రీ ఏర్పాటుకు గానూ దరఖాస్తు చేశాను. ప్రభుత్వం కొంత మేరకు సాయం చేస్తే మరికొంత సొంతగా ఏర్పాటు చేసుకుందామనే ఆలోచన ఉంది. పైరవీలకు తావు లేకుండా ఈ పథకం అమలు అర్హులకే దక్కాలి.

– గుర్రాల రమ్య, నర్సింహాపురం

సాయం అందించాలి..



నేను బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుకున్నా. డెయిరీ పరిశ్రమ ఏర్పాటు చేసే ఉద్దేశ్యంతో దరఖాస్తు చేసుకున్నాను. రాజీవ్ వికాస్ స్కీం ద్వారా యువతకు ఉపాధి కల్పించేలా ఆర్థిక సాయం అందిస్తే మేలు జరుగుతుంది. యువతకే ప్రాధాన్యత ఇవ్వాలి.

– బూసిపల్లి తిరుపతిరెడ్డి, నారాయణపురం

గైడ్ లైన్స్ రాలేదు..



రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం నుంచి ఎటువంటి గైడ్‌లైన్ రాలేదు. మండలానికి ఎన్ని యూనిట్లు కేటాయించారనే సమాచారం కూడా లేదు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5గంటల కల్లా ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలి.

– బి.సురేందర్, ఎంపీడీఓ, ఎర్రుపాలెం

ముగిసిన అంకమ్మతల్లి తిరునాళ్లు



అంకమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలోని శ్రీఅంకమ్మతల్లి తిరునాళ్లు ఆదివారంతో ముగిశాయి. పలు ప్రాంతాలనుంచి భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. శనివారం రాత్రి రైతులు ప్రభబండను ఊరేగింపుగా తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున నిప్పులగుండంపై అమ్మవారి విగ్రహంతో దాటడం, బద్దెగౌర్లై, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అన్నారుగూడెంలో అన్నదానం..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం అంకమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్మతరెడ్డి యుగంధర్‌రెడ్డి, రుక్మిణి దంపతులు విరాళం అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, దేవేందర్, వెంకటేశ్వరరావు, నరసింహారావు, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, వేలాద్రి పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన మారెమ్మ తిరునాళ్లు

వేంసూరు: మండలంంలోని కుంచపర్తిలో కొలువుదీరియున్న మారెమ్మతల్లి తిరునాళ్ల వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, అమ్మవారి కుంకుమ పూజ నిర్వహించారు.

శివాలయంలో పూజలు

చింతకాని: మండలంలోని నాగులవంచ శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం జరిగిన నేపథ్యంలో గ్రామంలో స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాట బృందం, డప్పు బృందాల ప్రదర్శన ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దాములూరి వెంకటేశ్వర శర్మ, నాగేంద్ర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం

వేంసూరు: వేంసూరులో కొలువుదీరిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. స్వామి కల్యాణ తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైరా మండలానికి రెండు సబ్‌స్టేషన్లు మంజూరు

వైరా: నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించేందుకు ప్రభుత్వం వైరా మండలానికి రెండు సబ్‌స్టేషన్ల మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 33–11 కేవీ సామర్థ్యం గల రెండు సబ్ స్టేషన్లు రూ. 2.50 కోట్లు అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. ఈ సబ్ స్టేషన్లు వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ పట్టణ ప్రకృతి వనంలో ఏర్పాటు చేయనుండగా.. మరొకటి రెబ్బవరంలో, అయితే రెబ్బవరంలో ఇప్పటికే అధికారులు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్లు సమాచారం. రెబ్బవరంలో ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్ పరిధిలో తాటిపూడి, జింకలగూడెం, కొస్టాల, రెబ్బవరం, ఖానాపురం, కొండకొడిమ గ్రామాలతో పాటు, ఓ ఫీడర్‌ను బోనకల్ మండలానికి కూడా అందించేందుకు ఆలోచన చేస్తున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులతో పాటుగా కొణిజర్ల మండలంలో 5 గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరా అందించే విధంగా సబ్ స్టేషన్ ఫీడర్లు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ వినియోగానికి కూడా ఇదే సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేయనున్నారు. వైరా మండలంలో వైరా, గరికపాడు ప్రాంతాల్లో ఇప్పటికే రెండు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ, భవిష్యత్ అవసరాలను దృష్ట్యా విద్యుత్ శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే మరో 15రోజుల్లో శంకుస్థాపన కార్యక్రమం ఉండవచ్చని సమాచారం.

సంక్షిప్త సమాచారం

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కల్లూరురూరల్: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం కల్లూరులో ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చింతలపూడి రాయల నాగేశ్వరరావు పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగం పరిరక్షణ కోసం అనునిత్యం యూటీఎఫ్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ జి.సుధీర్, మండల మహిళా ఉపాధ్యక్షురాలు డి.సుజాత, సీనియర్ నాయకులు, కల్లూరు మండల శాఖకార్యదర్శి బి.రాంబాబు, ముత్తయ్య పాల్గొన్నారు.

భూమిపూజ

సత్తుపల్లి: మండలంలోని బుగ్గపాడులో శ్రీ విశ్వధర్మక్షేత్రం ప్రాంగణంలో నిర్మించే వేద పాఠశాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పాఠశాల నిర్మాణానికి గ్రామానికి చెందిన తుమ్మూరి రవీంద్రబాబు, మాధవి దంపతులు రూ.25వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆలయ నిర్వహకులు వెల్లటూరి ప్రసాదాచార్యులు, పవన్, తుమ్మూరి శ్రీరామప్రసాద్, చల్లగుళ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గన్నీ సంచులు అందించాలి



శివాలయం వద్ద కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కల్లూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుబాటులో గన్నీ సంచులు, టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని రావికంపాడు, పుల్లయ్యబంజర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణరెడ్డి, హనుమంతరావు, అంజయ్య, వెంకటేశ్వరరావు, కృష్ణార్జునరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..



ఐదు ఉద్యోగాలు సాధించిన జ్యోతి శిరీషను సన్మానిస్తున్న అంబేడ్కర్ యూత్, గ్రామ పెద్దలు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఆదివారం బీఆర్ అంబేడ్కర్ యూత్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఐదు ఉద్యోగాలు సాధించిన జంగం జ్యోతి శిరీషను ఘనంగా సన్మానించారు. ఆమె అనారోగ్యాన్ని జయించి గ్రూప్–1లో మంచి ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జాను, శ్యామ్, ఆల్ఫాన్స్, కిరణ్, శ్రీను, వెంకటేశ్, సోమశేఖర్, కాటయ్య, చిన్నప్ప, కృష్ణ, ప్రేమ్ చంద్, దేవదాసు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి.. ఆర్థిక సాయం

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో ప్రమాదానికి గురై గాయపడిన గత్తం నాగేశ్వరరావును పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు గ్రామ కాంగ్రెస్ నాయకులు చంద్ర శ్రీనివాసరావు రూ.12వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందిచి త్వరగా కోలుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాంతయ్య, రమేష్‌బాబు, రాజు, నాగేశ్వరరావు, మల్లిఖార్జున్‌రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల వానరాళ్లు సైతం పడ్డాయి. గాలివానకు మామిడి తోటలో కాయలు నేల రాలాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మక్కలపై రైతులు టార్పాలిన్లు కప్పుతున్నారు. అయినా అవి తడిసి ముద్దయ్యాయి. పలు గ్రామాల్లో, రోడ్లపై భారీ వృక్షాలు రోడ్డుపై పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే రేకుల ఇళ్లు కూలిపోయాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా మామిడి, వరి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు ఆటంకం కల్గింది.

– సాక్షి నెట్‌వర్క్



వైరారూరల్: గన్నవరం – దాచాపురం గ్రామాల మధ్య నేలకొరిగిన భారీ తాటి చెట్టు



వైరారూరల్: గరికపాడులో కూలిన రేకులు

రజతోత్సవ సభను జయప్రదం చేయండి



పెనుబల్లి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి/కొణిజర్ల: ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ మదన్‌లాల్ తెలిపారు. ఆదివారం పెనుమల్లి మండల పరిధిలోని మత్తుగూడెంలో కర్నాటి భూమారెడ్డి మామిడితోటలో మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వెంకటవీరయ్య పాల్గొని మాట్లాడారు. అనంతరం వృక్ష ప్రేమికుడు వనజీవి రామయ్య మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. అదే విధంగా కొణిజర్లలోని బోడపోతుల బాబు నివాసంలో నిర్వహించిన సమావేశంలో మదన్‌లాల్ పాల్గొని.. నాయకులతో కలిసి సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కిరణ్, మల్లేష్, నాగేశ్వరరావు, రోషన్‌బేగ్, జీడయ్య తదితరులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన సైలోబంకర్ బాధితులు



భట్టికి సమస్యను వివరిస్తున్న బాధితులు

సత్తుపల్లి: మండలంలోని కిష్టారం సైలోబంకర్ బాధితులు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. బంకర్ కాలుష్యం వలన కిష్టారం అంబేడ్కర్ నగర్, బీసీ కాలనీలలో అనేకమంది అనారోగ్యాలతో చనిపోయారని, కాలుష్యం భారిన పడి తీవ్రంగా నష్టపోతున్నామంటూ వాపోయారు. ఈ విషయంపై స్పందించిన ఆయన త్వరలోనే కాలనీని సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మదీనా, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, నరేంద్ర, నాగమణి, రత్తమ్మ, జాన్‌బీ పాల్గొన్నారు.

భట్టికి సమస్యను విన్నవించిన గ్రామస్తులు..

ముదిగొండ: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముదిగొండ మండలం వల్లాపురం మీదుగా ఆదివారం మధిర వెళ్తున్న క్రమంలో నాయకులు, గ్రామస్తులు భట్టి కాన్వాయిని ఆపి సమస్యలు విన్నంచారు. గ్రామంలో ఆరు కుంటల గ్రామకంఠ స్థలం ఆక్రమణకు గురైందని, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని భట్టికి తెలుపగా.. అట్టి స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్‌తో ఫోన్లో స్థలాన్ని పరిశీలించాలని తెలిపారు. మధిర క్యాంపు కార్యాలయంలో అక్కడ అధికారులతో మాట్లాడారు.

అంబేడ్కర్ త్యాగం మరువలేనిది..

బోనకల్: అంబేడ్కర్ జీవితకాలమంతా దేశాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసమే ధారపోశారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గల్లా సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని రావినూతలగ్రామంలో ‘గ్రామం చలో–బస్తీ చలో’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేశారు. ముంబైలో జరిగిన ఎన్నికల్లో ఆనాడు కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలసి అంబేడ్కర్‌ను ఓడించారని.. ఆయన గురించి మాట్లాడే హక్కు వారికి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మౌనిక, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్, మధిర అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బోనకల్: ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామిరెడ్డి సిఫార్స్ మేరకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును లబ్ధిదారులకు బోనకల్‌లో ఆదివారం అందజేశారు. బోనకల్‌కు చెందిన మరీదు మౌనికకు రూ.25వేలు, గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రాచబంటి బ్రహ్మంకు రూ.20వేలు, ముష్టికుంట్ల గ్రామానికి చెందిన దొడ్డా వెంకటేశ్వర్లకు రూ.32,500 వేలు చెక్కులను టెలికమ్ అడ్వజరీ కమిటీ నంబర్ ఉమ్మినేని కృష్ణ చేతులమీదుగా అందిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మురళి, లక్ష్మీనారాయణ, శివ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణే ఏఐటీయూసీ ధ్యేయం



మాట్లాడుతున్న నరసింహారావు

కల్లూరు: కార్మిక హక్కుల పరిరక్షణే ఏఐటీయూసీ ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం కల్లూరులో యూనియన్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ సత్తుపల్లి నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారని, వారికి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు శివరామకృష్ణ, ఆదినారాయణ, రాంబాబు, రామకృష్ణ, దయాకర్, రాజశేఖర్, శేషయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ

మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లోని వీధుల్లో మట్టలతో క్రీస్తు ప్రార్థనలు చేస్తూ.. గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ పెద్దలు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: గండగలపాడులో మట్టల ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు



సత్తుపల్లిటౌన్: మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



బోనకల్: రావినూతల చర్చిలో..